కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు

ముషీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని చాకలి బస్తీ, భోలక్‌పూర్ హౌస్ ప్రాంతాలలో కలుషిత నీటి సరఫరా, లోప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్‌కుమార్ తదితరులు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి గురువారం వినతిపత్రం ఇచ్చారు. భోలక్‌పూర్ హౌస్ ప్రాంతంలో లోప్రెషర్ నీటి సరఫరా వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజక వర్గం జాయింట్ కన్వీనర్ మహేష్ కుమార్, భోలక్‌పూర్ డివిజన్ కార్యదర్శి వీరేష్, సీనియర్ నాయకులు నాగేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ మారణహోమం ఆపాలి : డీవైఎఫ్ఐ

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాకు సంఘీభావంగా, పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణహోమాన్ని, యుద్ధాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, వెంకటేష్ మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. 20నెలలకు పైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల వల్ల 55వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు. జావీద్, అస్మిత, రాజయ్య, మహేష్, ప్రవీణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

'మంగళాభట్ నాట్యరంగ సేవలు గుర్తుంటాయి'

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నృత్యకళాకారిణి, కథక్ నాట్యగురువు మంగళాభట్ మృతి నృత్యరంగానికి తీరనిలోటు అని కథక్ నాట్య గురువు, కథక్ కళాక్షేత్ర డైరెక్టర్ పండిట్ అంజిబాబు పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని కథక్ కళాక్షేత్ర ఇనిస్టిట్యూట్‌లో గురువారం మంగళాభట్ సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కథక్ నాట్యంలో ఎందరో శిష్యులను మంగళాభట్ తీర్చిదిద్దారన్నారు. ఆమె నాట్యరంగానికి అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీ ఏడీఈలు తెలిపారు. గోల్కొండ క్రాస్‌రోడ్ , స్పెన్సర్, రేణుకా ఎన్‌క్లేవ్, తాళ్లబస్తీ 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, దయారామార్కెట్, బంజారా ఎవెన్యూ, రామకృష్ణమఠ్, దోమలగూడ పరిధుల్లో 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బీజేపీ కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా రమేష్

కవాడిగూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కవాడిగూడ డివిజన్ ప్రధానకార్యదర్శిగా బొల్లరమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని బీజేపీ డివిజన అధ్యక్షుడు దిలీప్‌యాదవ్ గురువారం ప్రకటించారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ సూచించారు. గురువారం ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ చిన్నారులకు పలకలను అందజేసి ఓనమాలు దిద్దించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాభ్యాసం చేయడంతోపాటు పౌష్టికాహారం అందజేస్తారని తెలిపారు. బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు రోజూ పాలు, గుడ్లు, వివిధరకాల ఆహారం అందిస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచిముదిరాజ్, నాయకులు సత్యనారాయణ, వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్ శారద పాల్గొన్నారు.

తాగునీరు, కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

రాంనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వీధిలో మంచినీరు, కలుషిత నీటి సమస్యను పరిష్కరించడంలో జలమండలి అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ కార్పొరేటర్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధానకార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ ఆరోపించారు. గురువారం చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వీధిలో ఆయన పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై జలమండలి మేనేజర్ జ్యోతి, డీజీఎం మోహన్‌రావు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించని పక్షంలో ప్రజలతో కలిసి జలమండలి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

అంబర్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన్ కార్యదర్శి చంద్రశేఖర్ సూచించారు. మోదీ 11 సంవత్సరాల పరిపాలన పూర్తయిన సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప్ సభ రచ్చబండ కార్యక్రమం శక్తి కేంద్రా ఇన్‌చార్జ్ మైలారం రాజు ఆధ్వర్యంలో గురువారం ప్రేమ్‌నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డా.గౌతమ్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్రఅధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నేతలు సతీష్‌గౌడ్, దాసోజు నాగభూషణంచారి, కృష్ణముదిరాజ్, యశ్వంత్, భాస్కర్‌గౌడ్, శ్రీకాంత్, భిక్షపతి, రాజు, తిరుపతిగుప్తా పాల్గొన్నారు.

● **బర్కత్‌పుర:** మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11ఏళ్లు నిండినసందర్భంగా గురువారం కాచిగూడ డివిజన్ ఇందిరానగర్‌లో వికసిత్‌భారత్ రచ్చబండ కార్యక్రమం నిర్వంచారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, శంకర్,రాము, ప్రశాంత్, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాసర ఐఐఐటీలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: బీఎంఎస్

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర ఐఐఐటీలో పని చేస్తున్న కార్మికులకు నాలుగేళ్లుగా పెరిగిన జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ జాతీయ కార్యవర్గసభ్యులు కేవీ.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కార్మిక కమిషనరేట్ ముందు బీఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ జిల్లా బాసర ఐఐఐటీ కార్మికులు ధర్నా నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా కార్మికులకు డీఏ చెల్లించడం లేదని ఆరునెలలకు ఒకసారి పెరిగిన 8 వీడీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. పే స్లిప్‌లు కూడా కార్మికులకు నాలుగు సంవత్సరాలుగా ఇవ్వడంలేదన్నారు. అనంతరం డీసీఎల్ నీలమ్మకు వినతిపత్రం సమర్పించారు. బీఎంఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశం, ఎ.శంకర్, సామ బాల్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనిషిని ఉన్నతంగా నిలిపేది సేవాభావం

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మనిషిని సేవాభావం ఉన్నతంగా నిలుపుతుందని సీనియర్ పాత్రికేయులు బైస దేవదాసు అన్నారు. పలు సామాజిక కార్యక్రమాలు చేస్తూ ప్రతి ఏటా భార్య పేరిట పురస్కారం అందిస్తున్న రామమోహన్‌రావు అభినందనీయులన్నారు. శ్రీకిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ఏకా నాగరాజ రామమోహనరావు తన భార్య ఏకా పద్మ స్మారక పురస్కారం ప్రముఖ హార్ట్ వైద్యనిపుణుడు డా.ముదావత్ కిషన్‌కు బహూకరించారు. అవంతి డిగ్రీ, పీజీ కళాశాల డా.దంతుర్తి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో పురస్కారగ్రహీతను సాహితీ కిరణం మేనేజర్ పొత్తూరి విజయలక్ష్మి అభినందించారు. సంస్థనిర్వాహకులు లంక సుబ్రహ్మణ్యం, కార్యదర్శి భాను పాల్గొన్నారు.

తుదిదశకు అశోక్‌నగర్ నాలా
లింక్ బ్రిడ్జి!
చిక్కడపల్లి నుంచి నేరుగా లిబర్టీ, సచివాలయం



నిర్మాణం చివరిదశలో ఉన్న అశోక్ నగర్ నాలాపై నిర్మిస్తున్న లింక్‌బ్రిడ్జి

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ నాలా మీద నిర్మిస్తున్న లింక్‌బ్రిడ్జి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులు చివరిదశకు చేరుకున్నాయి. చిక్కడపల్లి మెయిన్‌రోడ్, సుధాహోటల్, సిటీసెంట్రల్ లైబ్రరీ మీదుగా నేరుగా అశోక్‌నగర్ నాలా మీదుగా సూరజ్‌నగర్, దోమలగూడ, గగన్‌మహల్ మీదుగా నేరుగా లిబర్టీకి చేరుకోవడానికి ఈ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఏడాది కిందట మొదలైన పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. మరో రెండు రోజుల్లో అశోక్‌నగర్‌వైపు నిర్మిస్తున్న ర్యాంపు పనులు పూర్తవుతాయి. సూరజ్‌నగర్‌వైపు నిర్మించనున్న ర్యాంప్‌పనులు ఆ వెంటనే మొదలై పదిహేనురోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తయినట్లేనని సిబ్బంది చెబుతున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా ప్రహరీ, బ్రిడ్జి రోడ్డు కూడా పూర్తయ్యింది. ఇక సూరజ్‌నగర్ వైపు ర్యాంపు పనులు మొదలైతే ఇక బ్రిడ్జి అందుబాటులోకి వచ్చినట్లేనని తెలుస్తోంది. తీగల కృష్ణారెడ్డి మేయర్, డా.లక్ష్మణ్ ఎమ్మెల్యే, శైలజాగోపాల్ కార్పొరేటర్‌గా ఉండగా ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే వివిధ కారణాల రీత్యా ఈ బ్రిడ్జి అమలుకు నోచుకోలేదు. ఏడాదికిందట పనులు మొదలుపెట్టి పూర్తి చేస్తున్నారు. చిక్కడపల్లి, అశోక్‌నగర్, జవహర్‌నగర్, వివేక్‌నగర్, సంజయ్‌నగర్, ఆర్టీసీక్రాస్‌రోడ్, బాగ్‌లింగంపల్లి వాసులకు ఈ బ్రిడ్జి ఎంతోఉపయోగంగా ఉంటుంది. నారాయణగూడ సిగ్నల్, హిమాయత్‌నగర్ సిగ్నల్‌ను దాటి లిబర్టీకి చేరుకోవడానికి కనీసం 20 నిమిషాలు పట్టేది. వాహనచోదకుడు ప్రస్తుతం నిర్మాణం అవుతున్న బ్రిడ్జి మీదుగా పదినిమిషాల్లో చిక్కడపల్లి నుంచి లిబర్టీ చేరుకోవచ్చు.

పనులు పూర్తి చేయాలి



పనులు వేగవంతంగా పూర్తిచేసి బ్రిడ్జిని ప్రజలకు ఉపయోగంలోకి తేవాలి. చిక్కడపల్లి మెయిన్‌రోడ్ నుంచి వచ్చే ట్రాఫిక్ రద్దీని తట్టుకోవడానికి రోడ్డును వెడల్పు చేయాలి. చిక్కడపల్లి మెయిన్ రోడ్ నుంచి అశోక్‌నగర్‌నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు చేయాలి. అదేవిధంగా దోమలగూడ సూరజ్‌నగర్ వద్ద కూడా రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరం ఉంది. లేదంటే బ్రిడ్జి నిర్మించి ప్రయోజనం ఉండదు. ఒక్కసారి బ్రిడ్జి వినియోగంలోకి వచ్చిందంటే ఇటు చిక్కడపల్లి, అటు హిమాయత్ నగర్, మరోవైపు అశోక్‌నగర్ నుంచి వాహనాల రద్దీ పెరుగుతుంది. కాబట్టి రోడ్డును వెడల్పు చేస్తేనే బ్రిడ్జి ప్రయోజనం సిద్ధిస్తుంది.

- కార్పొరేటర్ పావని

ప్రజలకు ఎంతో ఉపయోగం



అశోక్‌నగర్ నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుంది. చిక్కడపల్లినుంచి నేరుగా లిబర్టీ, సచివాలయానికి చేరుకోవడానికి ఈ వంతెన వాహనదారులకు వారధిగా నిలుస్తుంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు కానున్న మాల్‌లు, చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం పునర్‌నిర్మాణం కావడం వల్ల రద్దీ పెరుగుతుంది. ప్రజలు బ్రిడ్జి పూర్తయినాక ఉపయోగించుకోవాలి. ప్రయాణభారం తగ్గించుకోవడానికి ఉపయోగపడే ఈ బ్రిడ్జి లక్ష్యాన్ని విజయవంతం చేయాలి.

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం: వీహెచ్



కేక్‌ను కట్ చేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్, ఎమ్మెల్సీ అమీర్‌అలీ, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

రాంనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశానికి భావిప్రధాని పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అవుతారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ధీమా వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని సూచించారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేకచర్యల వల్ల ఆయన గ్రాఫ్ పూర్తిగాపడిపోయిందని, ప్రజల విశ్వాస్వాన్ని కోల్పోయారని అన్నారు. గురువారం బాగ్‌అంబర్‌పేటలోని తన నివాసంలో పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జన్మదినవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అమీర్‌అలీతో కలిసి వీహెచ్ రాహుల్‌గాంధీ జన్మదిన కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పార్లమెంట్ ప్రతిపక్షనేతగా కేంద్రప్రభుత్వంచేస్తున్న తప్పుడు విధానాలను ఎదురిస్తున్నారని అన్నారు. రాహుల్ చేస్తున్న ప్రజాపోరాటం చూసి బీజేపీనేతలు కంగుతింటున్నారని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, ముజాహిత్‌ఆలీఖాన్, అఫ్సర్ యూసఫ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, పుల్లా నారాయణస్వామి, రామ్మోహన్, తెలుపునూరి కృష్ణగౌడ్, జమీర్, సతీష్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, శశిధర్‌గౌడ్, ఠాకూర్ హరితిలక్‌సింగ్, మహేష్‌గౌడ్, సుధాకర్,సునీతారెడ్డి, హేమ, పద్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశం సమగ్రాభివృద్ధి

ముషీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే దేశం సమగ్ర అభివృద్ధి చెందుతుందని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా గురువారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి శ్రావణ్, రాము సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజ్జి శత్రు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేశారు. నేటి యువతకు రాహుల్ గాంధీ ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, రాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు, నర్సులకు చీరలు పంపిణీ

భోలక్‌పూర్‌లోని బడీమసీదు వద్ద టీపీసీసీ లీగల్‌సెల్ కో కన్వీనర్ సయ్యద్ మోహినొద్దీన్ రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు, ప్రభుత్వ ఆసుపత్రి నర్సులకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్వేత, కరీం తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

కవాడిగూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నిలోఫర్ ఆస్పత్రిలో రోగులు, సిబ్బందికి గురువారం పండ్లు పంపిణీ చేశారు. టీపీసీసీ నూతన ప్రధాన కార్యదర్శి వెంకటగోవిందరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగోవిందరావు మాట్లాడుతూ ఈ దేశానికి, యువతరానికి భవిష్యత్ కావాలంటే రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మచ్చ విజయ్‌కుమార్, ముంజగల్ల విజయ్, మహమూద్, నాగరాజు, ప్రవీణ్. పి.పురుషోత్తంరెడ్డి, రాఘవేందర్, షేక్‌అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తులను ఆదుకోవాలి

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు నిర్వహించి, సమాజంలో అన్నార్తులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన సందర్భంగా గురువారం డివిజన్‌లోని సబర్మతి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పండ్లు, బిస్కెట్లు, చాక్‌లెట్లు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, హఫీజ్, నరేందర్‌యాదవ్, దినేష్, ముస్రఫ్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు, శ్రావణ్



నిలోఫర్ ఆస్పత్రిలో రోగులు, సిబ్బందికి పండ్లు పంపిణీ చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకట గోవిందరావు తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురికి గురువారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బల్ల ప్రశాంత్, డివిజన్ మాజీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, జార్జ్, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● **గోల్నాక:** బాగ్‌అంబర్‌పేట డివిజన్ తురాబ్‌నగర్‌కు చెందిన రజిత అనారోగ్యంతో పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈమెకు ముఖ్యమంత్రి సహనిధి ద్వారా మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసీ లేఖను గోల్నాక తులసీనగర్‌కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం అందజేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలి

ముషీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో కృషిచేయాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు పి.శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహను కలిసి స్థానిక సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా ముఠా జైసింహను శ్రీధర్‌చారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు వివేక్, వీరేష్, కరికె కిరణ్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి సహకారం

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధిని అందించే ఉచిత శిక్షణాకేంద్రాలకు పూర్తిగా సహకరిస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. వీవీ గిరినగర్ కమ్యూనిటీహాల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నివి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహిళల ఉచిత బ్యూటీషియన్ శిక్షణకేంద్రాన్ని గురువారం కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ సందర్శించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్ మహిళలతో, శిక్షణనిచ్చే టీచర్ ప్రవీణతో కార్పొరేటర్ మాట్లాడారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ 27 ఆంధ్రా కులాలను బీసీ జాబితాలో కలపొద్దు

కవాడిగూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలగించిన 27 ఆంధ్రా ప్రాంతానికి చెందిన కులాలను తెలంగాణ ప్రభుత్వం మళ్లీ బీసీ జాబితాలో కలుపొద్దని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడపశ్రీహరి, తెలంగాణ బీసీ 'ఏ' కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ భాగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం మాజీ ఎంపీ వి.హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మళ్లీ ఆ 27 కులాలు కలిపితే తెలంగాణలోని బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ బీసీకులాలకు అన్యాయం జరగకుండా తనవంతుగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, తనవంతు కృషి చేస్తానని చెప్పారని నాన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా దోమల నివారణ స్పెషల్ డ్రైవ్



బాకారంలో ఫాగింగ్ పనుల పర్యవేక్షణలో పాల్గొన్న సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సికింద్రాబాద్ జోన్ పరిధిలోని అన్ని మున్సిపల్ డివిజన్లలో దోమల నివారణ కోసం స్పెషల్ డ్రైవ్, ప్రత్యేక వాహనాలు, ఫాగింగ్ మిషన్లతో దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాంనగర్ డివిజన్‌లోని బాకారంలో చేపట్టిన దోమల నివారణ ఫాగింగ్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి జోనల్‌కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోకి వచ్చే అన్ని సర్కిళ్లలో మున్సిపల్ డివిజన్ల వారీగా ఒక్కొక్క రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, అన్ని బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో దోమలనివారణ కోసం ఫాగింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ కె.రవిచారి మాట్లాడుతూ జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈస్పెషల్ డ్రైవ్ వల్ల డివిజన్‌లోని 45 బస్తీలు, కాలనీలలో ఫాగింగ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు రైల్వే దొంగల అరెస్ట్



దొంగల వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావేద్

బర్కత్‌పుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడిని బెదిరించి సెల్‌ఫోన్, నగదు లాక్కొని పారిపోయిన ఇద్దరు దొంగలను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగల వివరాలను గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావేద్, సీఐ ఎల్లప్ప, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ రజితతో కలిసి వెల్లడించారు. ఈనెల 9వ తేదీన మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా కనకయ్య అనే ప్రయాణికుడి నుంచి సెల్‌ఫోన్, నగదును ఇద్దరు దొంగలు చోరీ చేశారు. దీనిపై రైల్వే పీఎస్‌లో కేసు నమోదైంది. గురువారం అంబర్‌పేట బతుకమ్మకుంటకు చెందిన దాసరి మౌనిక(20) రంగారెడ్డి జిల్లా పోతుగల్ గ్రామానికి చెందిన బి.సుక్కయ్య(35) కాచిగూడరైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీంతో వారిద్దరిని పట్టుకుని రైల్వే పోలీసులు విచారించారు. తాము చేసిన దొంగతనం ఒప్పుకున్నారు. వారి నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.500నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

కత్తితో దాడిచేసిన కేసులో రౌడీషీటర్..

రైలుప్రయాణికుడిపై కత్తితోదాడిచేసి, గాయపరిచిన కేసులో రౌడీషీటర్‌ను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావేద్, సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాలప్రకారం... యాకత్‌పురకు చెందిన షేక్‌ఖదీర్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగి ఇంటికి వెళ్తుండగా మాదన్నపేటకు చెందిన రౌడీషీటర్ మహ్మద్‌అబ్దుల్ సోహేల్‌తోపాటు అతని అనుచరులు డబ్బులు, సెల్‌ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. షేక్‌ఖదీర్ అడ్డుకోవడంతో మహ్మద్ అబ్దుల్ సోహెల్ కత్తితో దాడి చేసి గాయపరిచారు. దీనిపై కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదుచేయగా దీనిపై అబ్దుల్ సోహెల్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని రైల్వే పోలీసులు తెలిపారు.